# అవ్యక్తం

"ప్రియ మధూ!

ఉత్తరం వ్రాయాలని మొదలు పెట్టానేగానీ ఏం వ్రాయాలో తోచడంలేదు. నేను అమెరికా వెళుతున్నాను, మధూ! ఈ అవకాశం లభించినందుకు ఎంత సంతోషంగా ఉన్నా నీకు దూరంగా వెళ్లిపోతున్నా ననుకుంటే... మధూ! నా మనసులో రేగుతున్న భావ సంచలనాన్ని అక్షర రూపంలో పెట్టే శక్తి నాకు లేదు. నీలా రచయిత్రిని గానుగా మరి! రేపు సాయంత్రం వచ్చేస్తున్నా. బస్సుస్టాండ్‌కు వస్తావు కదూ! ఊరు చేరాక కూడా నిన్ను చూడకుండా పది నిమిషాలు వృథాచేయడమంటే మనసొప్పదు. తప్పక రావాలి సుమా! ఇక ఎల్లుండి సెలవు తీసుకోమని వేరుగా వ్రాయాలా? నే నక్కడ ఉండే ఒక్క రోజూ నీ సమయమంతా నాతోనే గడపాలని తెలుసుగా! నీతో ఎన్ని మాట్లాడాలని! మరిక చాలించనా?

ప్రేమతో

... నీ వారిజ."

ఉత్తరం చదవడం ముగించి చిన్నగా నవ్వుకున్నాను, 'ఏమిటి పిచ్చి వారిజకు' అని. వారిజతో నా పరిచయం కాకతాళీయంగా జరిగింది. యూనివర్శిటీ వారు జరిపే వక్తృత్వపు పోటీలో పాల్గొనే ఇద్దరు విద్యార్థినులను తీసుకుని తిరుపతి వెళ్లాను నాలుగేళ్ల క్రితం. హాస్టల్లో గది కావాలని అడగడానికి వార్డెన్ దగ్గరికి వెడితే – "గదులు ఖాళీ లేవని చెప్పాను గదమ్మా! నన్నెందుకు ఇబ్బంది పెడతారు?" అన్నారు శారదాంబగారు తలెత్తి చూడకుండానే. నాకు నవ్వొచ్చింది. ఆమె నన్నింకా విద్యార్థినిగానే భావిస్తున్నట్టున్నారు.

"నేను మేడమ్, మాధవిని" అన్నాను నవ్వుతూ.

తలెత్తి చూసి నవ్వేశారామె. చాలా రోజులయింది చూసి. "ఎక్కడ పని చేస్తున్నావు?" అంటూ కుశల ప్రశ్నలు వేసి నా కొకగది, మా విద్యార్థినుల కొక గది ఇచ్చి, నేను మరొక లెక్చరర్‌తో గది షేర్ చేయవలసి ఉంటుందన్నారు. సరేనంటూ హాస్టల్‌కు వచ్చాను.

గదిలోకి అడుగు పెట్టగానే ఆమె కనిపించింది. ఒయ్యారంగా పడుకుని 'ఫెమినా' కాబోలు చదువుతున్నది. పల్చని చీర గాలికి రెపరెపలాడుతున్నది. తలకు పోసుకుందేమో

అల్లకుండా వదిలేసిన జుత్తు ఫ్యాను గాలికి తమాషాగా కదులుతూంది. ఛామనఛాయలో ఉన్న మొహం మీద దట్టంగా వేసిన గులాబి రంగు పౌడరు, పెదవులకు రంగు, ఘాటుగా వస్తున్న లవెండర్ సువాసన.. నా కామె మీద సదభిప్రాయం కలిగించలేదు. అత్యంతాధునికంగా తయారయ్యే వారంటే నా కంతగా ఇష్టం ఉండదు. కాగా రవ్వంత భయం కూడా!

ఆవిడ నన్ను చూడగానే ఇంగ్లీషులో పలకరించింది. "ఏ ఊరునుండి వచ్చారు?" అని. ఆమె ఆంధ్ర వనిత కాదన్న అనుమానం నాకు లేకపోవడం వలన తెలుగులో సమాధాన మిచ్చి బట్టలు తీసుకుని స్నానానికి వెళ్లాను. ఆమె పేరు వారిజ!

"మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం కావాలన్నారు. ఒంటిగంట నుండి ముస్తాబవుతున్న వారిజను, ఆవిడ వాడుతున్న అలంకరణ సామాగ్రిని వింతగా చూస్తూ పడుకున్నాను.

"మీరు తయారవ్వరా?" అన్నదామె గడియారం వంక చూస్తూ! లేచి మొహం కడుక్కుని, బొట్టూ కాటుక పెట్టుకుని, జడ వేసుకోవడం కానిచ్చి, చీరకూడా మార్చుకుని వచ్చేసరికి వారిజ చీర కుచ్చెళ్లు సర్దుకుంటూ కనపడింది.

"టైం మయినట్టుంది" అన్న నా మాట వినిపించుకోకుండా "కాస్త వెనకాల గుండీలు పెడతారా?" అంటూ వెనక్కి తిరిగింది.

నడినెత్తిమీద వేసిన ముడి చూస్తూ 'లావుగా ఉన్న వారికి స్లీవ్‌లెస్ జాకెట్స్ బావుండవని ఈమెకు తెలియదా?" అనుకుంటూ ఆ పనిపూర్తి చేశాను.

మా కళాశాల విద్యార్థినికి ద్వితీయ బహుమతి వచ్చిందని ప్రకటించగానే నవ్వు ముఖంతో వచ్చి నాకు అభినందనలు తెలిపి – "మీరు మాకు పార్టీ ఇవ్వాలి' అంది వారిజ.

కాదనలేక ఆమెనూ, ఆమె కూడ వచ్చిన ఇద్దరు అమ్మాయిలనూ భీమాస్ క్యాంటీన్‌కు తీసుకు వెళ్లాను. అక్కడ నుండి అలా నడుచుకుంటూ ఎర్రని కట్టడాలను దాటి నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశంలో చదికిల వద్దాము.

ఉత్సాహంతో ఉరకలు వేస్తున్న మా అమ్మాయి లిద్దర్నీ తమాషాగా అడిగాను – "ఇంతకీ మీరు గెలిచినందుకు నాకేమిస్తారు?" అని.

"ఏం కావాలో అడగండి, మేడమ్!" ముక్తస్వరంతో అన్నా రిద్దరూ!

"చెరో పాట పాడమనండీ! మనకు కాలక్షేపం." వారిజ నవ్వుతూ సలహా ఇచ్చింది.

"ఏం, మీకు పాటలంటే ఇష్టమా?" కుతూహలంగా అడిగాను ఏ పాప్ మ్యూజిక్ లాటిదో ఇష్టమేమో అనుకుంటూ.

"కృష్ణ శాస్త్రి గారివీ, నండూరి వారివీ పాటలు వింటూంటే తిండి, నిద్ర అక్కరలేదనిపిస్తుంది" అంది వారిజ.

"మా మేడమ్ లలిత సంగీతం చాలా బాగా పాడతారండీ!" సిసింద్రిల్లా అందించారు మావాళ్లిద్దరూ!

"అయితే మీరొక పాట పాడాల్సిందే" అన్న వారిజను వారిస్తూ – "సరిసరి, నా మాటకేం గానీ ముందు వాళ్ల పాట విందాం" అంటూ మాట దాటించాను.

మా పిల్లలిద్దరూ ఏవో సినిమా పాటలు పాడారు. "చీకటి పడుతూంది. ఇక పోదాం లేవండి" అంటూ లేవబోతున్న నా చేయి పట్టుకుని బలవంతంగా కూర్చోబెట్టింది వారిజ.

"మీరు పాట పాడందే ఇక్కడి నుండి కదలడం కల్ల!" అంటూ, ఆ చొరవకు విస్తుపోయాను. "అవును, మేడమ్! ఒక్కపాట" అంటూ మిగతా వాళ్లు వంత పాడారు.

అల్లనల్లన వీచే ఆ చల్లగాలి లలిత స్పర్శ ననుభవిస్తూ, రాగ రక్తిను నలముకొన్న నవవధువు మోములా సంజకెంజాయలో శోభిస్తున్న ఆకసం వైపు చూస్తూంటే హాయిగా పాడుకోవాలని నాకే అనిపించింది. నా కిష్టమైన పాట – 'మ్రోయింపకోయ్ మురళి మ్రోయింపకోయ్, కృష్ణ – తీయ తేనియ బరువు మోయలేదీ బ్రతుకు, పాడాను.

పాట ముగిసిన రెండు మూడు క్షణాలదాకా ప్రాణం పోసుకున్న చిత్రంలా కూర్చున్న వారిజ తరళ నేత్రాలలో రవ్వంత తడి కనిపించింది.

నా చేతిని తన చేతిలోకి తీసుకుని ఆప్యాయంగా నొక్కుతూ – "అద్భుతంగా పాడారు మాధవీ! మీరు అదృష్టవంతులు" అంది వారిజ మార్థవం తొణికిసలాడే గొంతుతో.

అయాచితమైన ఆ అభిమానానికి చకితురాలి నయ్యాను. కించిత్ సిగ్గుగా కూడా అనిపించిందా పొగడ్త విని.

"ఈ మాత్రం కూనిరాగ మెవరయినా తీయగలరు లెండి." తేలికగా అని లేచాము.

"నాబోంట్లకు పాటలంటే పంచ ప్రాణాలయినా, పాడబోతే కూనిరాగం ఖూనీరాగ మవుతుంది" – వారిజ నవ్వుతూనే ఈమాట అన్నా, ఆ స్వరంలో వ్యధ మిళితమై ఉన్నట్టనిపించింది.

ఊరికి వెళ్లే ముందు తన అడ్రస్ ఇచ్చి ఉత్తరాలు వ్రాస్తూండమని పదే పదే చెప్పింది వారిజ.

"అమ్మా! ప్రిన్సిపాల్‌గారు పిలుస్తున్నారు" అన్న సాంబయ్య మాటలతో ఆలోచనల నుండి తేరుకుని ఉత్తరం మడిచిపెట్టి లేచాను. ప్రిన్సిపాల్ గారి గదిలోనికి అడుగు పెట్టేసరికి మూర్తీభవించిన ముగ్ధత్వమా అనిపించే ఒక అమ్మాయి నాకోసమే చూస్తున్నట్టు కనిపించింది.

"మాధవీ! షి ఈజ్ మిస్ విజయ" అంటూ పరిచయం చేశారు ఆ అమ్మాయిని. లేత గులాబీ రేకుల్లా ఉన్న పెదవులు కదిలీ కదలనట్టు నవ్వి నమస్కరించింది విజయ. లావణ్యం రూపుదాల్చినట్టు ఆ అమ్మాయి కా పేరు అతకలేదనిపించింది నాకు.

"రండి! టైమ్ టేబిల్ తీసుకున్నాక క్లాస్ రూమ్స్ చూపిస్తాను" అని ఆమెను మా డిపార్టుమెంటుకు తీసుకు వెళ్లాను.

ఆ అమ్మాయి టైమ్ టేబిల్ వ్రాసుకునే సరికి రెండవ పీరియడ్ అయిపోయింది. "ఈ రోజు మీకేం క్లాసెస్ లేవు. రేపు బి.ఎ. క్లాస్ ఉంటుంది." అని చెప్పేసి ప్రిన్సిపాల్‌గారి వద్దకు

బయలుదేరాను. ఆమె అనుమతి తీసుకుని, సెలవు చీటీ ఇచ్చి తిన్నగా బస్సు స్టాండ్‌కు దారి తీశాను.

"వచ్చావా, మధూ? నాకు తెలుసు నువ్వు వస్తావని." మనసు నిండిన సంతోషంతో మాటలు కరవైపోగా ఆపేక్షగా నా భుజంచుట్టూ చేతులు వేసింది వారిజ. ఎంత మార్పు వారిజలో? క్రిందికి దువ్వి వదులుగా వేసిన జడ, నుదుట చిన్న కుంకుమ బొట్టు తప్ప మరే విధమైన మేకప్ లేదామె ముఖాన.

"ఏమిటలా చూస్తున్నావ్?" అన్న వారిజ చేతిని మృదువుగా తొలగిస్తూ, "ఇంటికి పద ముందు! తీరిగ్గా మాట్లాడుకుందాము." అంటూ ముందుకు నడిచాను.

లోపల అడుగు పెడుతుండగానే, "నీ కోసం ఏం తెచ్చానో చెప్పుకో!" అంది వారిజ.

"ఏం తెస్తావు? కబుర్ల మూట కాబోలు!" అన్నాను నవ్వి.

"నాకు తెలుసులేవోయ్ నీకు తెలియదని." గెలిచినట్టు సగర్వంగా మొహం పెట్టి బహు జాగ్రత్తగా పొట్లం కట్టి తెచ్చిన గులాబీలు సంచిలోంచి తీసి నా దోసిట్లో పోసింది. ఎర్ర గులాబీలంటే నాకు ప్రాణం!

"ఓ! లౌలీ.." అనేంతలో పెట్టె తెరిచి ఎఱ్ఱని అంచున్న తెల్లని కంచీపురం పట్టు చీర తీసి నా చేతిలో పెట్టింది.

"ఇదేమిటి?" ఆశ్చర్యపోయాను.

"చీర, అమ్మడూ! నీకిష్టంగా.." నవ్వింది వారిజ. "ఆ చీర కట్టుకుని, ఆ పూలు పెట్టుకుంటే అదీ అందం!" అంటూ స్నానానికి వెళ్ళిపోయింది.

నాకు చటుక్కున గుర్తొచ్చింది. ఆలోచనలు వెనక్కి మళ్ళాయి.

వారిజతో పరిచయమయిన మరుసటి ఏడాది నేను ఎగ్జామినర్‌గా వెళ్ళినప్పుడు ఇరవై నాలుగు రోజులు కాబోలు తిరుపతిలో ఉన్నాను. వారిజ కూడా వచ్చి నా గదిలోనే దిగింది. ఆ రోజుల్లోనే నా ప్రయత్నమూ, ప్రమేయమూ లేకుండానే వారిజ నాకు దగ్గిరగా వచ్చింది. తను తొందరగా పేపర్లు దిద్దేసి నా పేపర్స్ దిద్దిపెట్టేది. అలసిపోయి గదికి రాగానే పడి నిద్రపోయేదాన్ని నేను. కాఫీ, టిఫిను గదిలోనే తెప్పించి నా కోసం తనూ కాచుక్కూర్చునేది వారిజ.

"ప్లీజ్, మీరు నాకోసం వెయిట్ చేయకండి" అంటే "మీరు తొందరగా నిద్రలే వండి" అంటూ నా చెవిలో నీళ్లు తెచ్చి పోసేది. ఆ హొఅవకు నాకు కాస్త చిరాకు కలిగేది కూడా, సాయంత్రాలు సినిమాకో, గుడికో - ఎక్కడికో ఒక చోటుకు బయలుదేరదీసేది.

ఒక రోజు నేను తెల్లని చీర కట్టుకుంటే, అసలే సన్నగా ఉన్నారు. తెలుపు రంగు మీకు బాపుండదు... వేరే చీర మార్చుదురూ!" అన్నది వారిజ నొర్మొహమాటంగా.

నాకు మనసు చివుక్కుమంది. "మీకు అంత హెవీ మేకప్ నచ్చదు మానేయమంటే మానేస్తారా?" అన్నాను కాస్త వ్యంగ్యంగానే.

"మీకు ఇష్టంలేదంటే తప్పక మానేస్తాను. అయితే ఒక్కసారిగా కాదు. క్రమంగా తగ్గిస్తాను" అంది చాలా సిన్సియర్‌గా.

వచ్చేసే ముందు రోజు కొండమీదకి వెళ్లాము ఇద్దరం. దైవదర్శనం చేశాక అలా తోట వైపు బయలుదేరాము. రోజ్ గార్డెన్‌లో తిరుగుతున్నప్పుడు వారిజతో అన్నాను! "నేనూ ఒక గులాబినై ఉంటే ఎంత బావుండేది? ఈ పూవుల మధ్య పుట్టి ఇక్కడే రాలిపోయేదాన్ని...

"గులాబీలంటే అంతిష్టమా మధూ నీకూ?" వారిజ గొంతు మృదువుగా పలికింది

అల్లనల్లన వీచే పిల్లగాలికి పులకరించినట్టు తలలూపుతున్న పూల బాలలవైపు పరవశమై చూస్తున్న నేను వారిజ ఏకవచనంతో సంబోధించడం విని ఉలిక్కి పడ్డాను. అంతలో తేరుకుని నవ్వుతూ – "ఎఱ్ఱంచు తెల్ల పట్టుచీర కట్టుకుని ఈ పూవులు పెట్టుకుంటే అదీ అందం!" అన్నాను.

తిరిగి తిరిగి కాళ్ల నొప్పితో మంటపంలో కూలబడ్డాం! అక్కడి నుండి సర్వాంగ సుందరంగా కనిపించే ప్రకృతి కన్య అందాన్ని తిలకిస్తూ మైమరిచి పోయాను. "ఇంత అందాన్ని చూసి భరించలేముకదూ, వారిజా? నా కెందుకో ఈ క్షణాన ఈ లోయలోకి దూకేసి ఆ సౌందర్యంలో లీనమయిపోవాలని ఉంది" అన్నాను.

చటుక్కున నా నోటికి తన చేయి అడ్డు పెట్టి, "అలా మాట్లాడకు మాధవీ!" అంటున్న వారిజ కళ్లలో నీరు చూసి ఆశ్చర్యమనిపించింది. అందులో తన కంత బాధ కలిగించిన దేమిటో తెలియదు.

ఆ రోజు నా చేత తన కిష్టమైన పాటలన్నీ పాడించుకుని విన్నది వారిజ. "నల్లని వాడా నే గొల్ల కన్నెనోయ్ పిల్లన గ్రోవూదుమా' అన్న పాట ముగియగానే నా చేతిని తీసి తన చెక్కిలి నాకాన్చుకుని "ఎంత మధురస్వరం, మాధవీ నీది! నిజంగా ఈ రోజున నా జన్మలో మరిచిపోను..." అంటున్న వారిజ కనులలో మెదిలిన భావమేమిటో నా కర్థంకాలేదు. 'కొద్ది రోజుల పరిచయంలోనే ఎందుకీ అభిమానం?' అనుకుంటే వింతగా అనిపించింది కూడా!

"నిన్నే! ఏమిటా పరధ్యానం? లేదూ, వరధ్యానమా?" స్నానం ముగించి వచ్చిన వారిజ నవ్వుతూంది.

"నీ గురించే" అన్నాను వెనక్కి వాలి,

"సరిసరి, నేను వెళ్లిపోయాక నా గురించి తీరిగ్గా ఆలోచిద్దువుగానీ లేచి తలంటు పోసుకో ముందు" అంటూ లేవదీసింది హరిజ.

"ఎందుకూ? తెల్లబోయాను.

"ఎందుకు, ఏమిటి అన్న ప్రశ్నలు అడగరాదు. నువ్వు మా ఇంటికి ఎలాగూరావు. అందుకని నేను ఈ రోజు వంట చేస్తాను. నువ్వు చక్కగా తలంటుపోసుకుని కొత్త చీర కట్టుకుంటావట. తెలిసిందా?" ఆజ్ఞాపిస్తున్నట్టే అన్నది వారిజ.

"వారిజా! ఆ చీర... నువ్వేమీ అనుకోకు గానీ... అంత ఖరీదైనది నేను తీసుకోలేను..." ఎలా చెప్పాలో తెలియ లేదు నాకు.

హఠాత్తుగా వారిజ ముఖం వాడిపోయింది "మధూ" ఏం మాట్లాడాలో తోచనట్టు ఆగిపోయింది హరిజ. ఆ ఒక్క మాటతో ఆమె కెంతటి నిరాశ కలిగించానో అర్థమయింది నాకు.

"ఎందుకు, మధూ, నన్ను దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తావు?" అంటున్న వారిజ పెదవులు వణికాయి.

నేను క్లిష్ట పరిస్థితిలో ఇరుక్కున్నాను. తన ప్రేమాభిమానాలతో నన్ను ముంచి వేస్తున్న వారిజను నొప్పించడం నావల్ల కాలేదు.

"క్షమించు, వారిజా, నిన్ను నిరాశ పరచడం నా అభిమతం కాదు.. నీ ఇష్ట ప్రకారమే కాని..." అన్నాను.

వారిజ కళ్లు మిలమిలలాడాయి.

అన్నట్టుగానే ఆ రోజు నా కిష్టమైన సేమియా పాయసం, పులిహోర చేసింది వారిజ. తలంటు పోసుకుని తెల్లగా, మెత్తగా ఉన్న కొత్తచీర కట్టుకుంటుంటే 'పైకి కనిపించని వారిజ మనసు ఇంత మృదువైనదా?" అనిపించింది.

ఆలోచిస్తూ బొట్టు దిద్దుకుంటున్న నా పక్కన ఎప్పుడొచ్చి నిలబడిందో వారిజ – అద్దంలోని నా ప్రతిబింబాన్ని తదేకంగా చూస్తూ కనపడింది.

"ఏమిటలా చూస్తున్నావ్?" ముందుకు పడిన జడను వెనక్కి విసిరి పూవులు పెట్టుకోబోతూ అడిగాడును.

"నే పెడతా నుండు" అంటూ దండ తీసుకుంది హరిజ. జడలో పువ్వులు ముడిచి, మునివ్రేళ్లతో గడ్డం పట్టుకుని అలా నా కళ్లలోకి చూస్తూ ఉండి పోయింది రెండు క్షణాలదాకా, అంతలో తేరుకుని చటుక్కున నా నుదుటిమీద ముద్దు పెట్టుకుని వదిలేసింది.

ఆ కళ్లలోని వెలుగు, మెదిలిన ఒక అవ్యక్తమైన భావం నాలో ఆలోచనలను రేపింది.

మర్నాడు ఉదయాన్నే బయలుదేరింది వారిజ.

"మధూ! మళ్లీ ఎన్నేళ్లకు చూస్తానో నిన్ను? ఉత్తరాలు వ్రాయకుండా నన్నేడిపించకు, బంగారూ! నీ చేతివ్రాత చూచినా నిన్ను చూచినంత సంతోషం కలుగుతుంది నాకు. నీ కిదంతా వింతగా ఉంది కదూ? ఇంకా నన్ను అర్థం చేసుకోలేవా, మధూ?"

కళ్లనిండా నీటితో అంటున్న వారిజ వైపు అలా చూస్తూండిపోయాను. నా కెందుకో కన్నీరు రాలేదు. పైగా, అంత బాధపడడం అవివేకమనిపించింది.

రైలు కదిలింది. తలుపు వద్ద నిలబడి ఆర్ద్ర నయనాలతో చూస్తూ, చేతులూపుతున్న వారిజ రూపం నా మనసును క్షణకాలం కలవరపరచిన మాట వాస్తవం.

కానీ కాలేజీకి వెళ్లగానే వారిజ తలపుకు రాలేదు.

లైబ్రరీలో ఒక మూలగా కూర్చుని చదువుకుంటూ కనపడింది విజయ, బయటి ప్రపంచం ఉనికినే పట్టించుకొనకుండా పుస్తకంలో లీనమయి పోయిందా అమ్మాయి. ఆ అమ్మాయికి క్లాస్ ఫస్టొస్తుందన్న మాట గుర్తొచ్చింది.

"రండి బి.ఎ. క్లాస్ చూపించి పరిచయం చేస్తాను" అన్నాను. తలఎత్తి చూసిన ఆమె కళ్లలో లీలామాత్రంగా మెదిలిన భయ సంకోచాలను గుర్తించి లాలనగా అన్నాను.

"భయపడకండి! ఈ పిల్లలంతా బుద్ధిమంతులు. అల్లరి చేయరు."

నాకు సాధారణంగా ఎవరినీ చేతులు పట్టుకుని మాట్లాడడం, భుజం మీద చెయ్యి వేయడం వంటివి ఇష్టం ఉండవు. ఎవరి స్పర్శనూ సహించలేను నేను. కానీ, ఈ భీతహరిణేక్షణను చూడగానే ఎందుకిలా అనిపించిందోగానీ, క్లాస్ దగ్గర పడుతుండగా ఆదరంగా భుజంమీద చెయ్యివేసి నొక్కి – "మొదటి క్లాస్‌ను బట్టే ఇంప్రెషన్ కలుగుతుంది. బీ బోల్డ్ అండ్ స్ట్రిక్ట్!" అన్నాను.

క్లాస్ నుండి రాగానే ఉత్సుకతలో అడిగాను "ఎలా ఉంది క్లాస్?"

లలిత మధురంగా నవ్వి ఊరుకుంది విజయ. మాట్లాడని మల్లెమొగ్గ కాబోలు అనుకున్నాను. కల్పించుకుని మాట్లాడే అలవాటు లేకపోయినా కుతూహలం కొద్దీ అడిగాను – "ఎక్కడుంటున్నారు?" అని. తెలిసిన వాళ్లింట్లో గది తీసుకుని ఉంటున్నట్టు చెప్పింది విజయ.

తన పని చూసుకుని, ఒకరి గొడవ పట్టించుకోకుండా పుస్తకాలలో మునిగిపోయే విజయ అరుదుగా మట్లాడేది. మాట్లాడిన రెండు మూడు మాటలు తీయగా, మరీ మరీ వినాలనిపిస్తాయి.

విజయలో ఒక వింత అలవాటును గమనించాను. 'ఒథెల్లో', 'హామ్లెట్' వంటి నాటకాలలోని రసవత్తర ఘట్టాలను ఒక్కొక్కసారి భావయుక్తంగా పైకి చదివే దామె. ఆ విధంగా చదువుతున్నప్పుడు ఏదో పని ఉన్నట్టు అక్కడే ఉండేదాన్ని. ఒక్కొక్కసారి ఒంటరిగా కూర్చుని దీర్ఘాలోచనలో మునిగిపోయేది విజయ. అంతులేని విజ్ఞాన కాంక్షతో మెరిసే ఆ కనులలో అస్పష్టమైన విచార రేఖను చూసినప్పుడు నా మనసెందుకో గిలగిలలాడేది.

"విజయా, మీరు ఒంటరితనంతో బాధపడుతున్నట్టున్నారు. మీ అమ్మ గారిని కొన్ని రోజులపాటు వచ్చి మీ వద్ద ఉండమని వ్రాయరాదూ?" అన్నా నొకరోజు.

బాణోపహతమైన హరిణిలా చూసింది విజయ. ఇంద్రనీలాల వంటి ఆ కనులలో నీరు!

తప్పుగా మాట్లాడి నొప్పించానా అని మథనపడ్డాను. "అమ్మ చనిపోయి ఏడాది దాటింది." నెమ్మదిగా అంది విజయ. శరచ్చంద్ర సదృశమైన ఆ మోములో విచారాన్ని, రాగసుధా భరితమైన ఆ గొంతులో అపస్వరాన్ని గుర్తించి నా హృదయం తల్లడిల్లింది. ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకుని ఊరడించి నవ్వించాలని ఆరాటపడింది నా మనసు.

"సారీ, విజయా... వెరి సారీ... తెలియకుండా అడిగాను." ఎలాగో గొంతు పెగుల్చుకుని అన్నాను.

"ఫరవాలేదులెండి." పేలవంగా నవ్వేసి తన చదువులో మునిగిపోయింది.

అర్ధ సంవత్సరం పరీక్షల ముందు కాబోలు ఫిజిక్స్ లెక్చరర్ మెటర్నిటీ లీవ్‌లో వెళ్లగా ఆ ఖాళీలో సుధామణి వచ్చి చేరింది. లక్నో నుండి వచ్చిన సుధామణి కొద్ది రోజుల్లోనే విజయకు

చేరువయింది. ఎవరినీ తనంత తానుగా పలకరించని విజయ సుధామణితో చనువుగా మనసలడం చూసి ఒక విధమైన అసూయతో నా మనసు వేగిపోయింది.

విజయతో స్నేహం చేయాలని, ఆ అమ్మాయితో చనువుగా మసలాలని నా హృదయం ఆరాటపడసాగింది.

"విజయా! ఈ రోజు నేను మీ ఇంటికి వస్తున్నాను." ఉన్నట్టుండి ఒక రోజు విజయతో అన్నాను.

తెల్లబోయిన విజయ తేరుకుని నవ్వేస్తూ – "దానికేం మహాభాగ్యం – తప్పక రండి" అంది.

నన్ను కూర్చోమని లోపలకి వెళుతున్న విజయ ననుసరించి వంటింట్లోకి వెళ్లాను. కాళ్లు కడుక్కుని వచ్చి దేవుని ముందు దీపం వెలిగిస్తున్న విజయతో అన్నాను.

"ఈ రోజు నా పుట్టిన రోజు కదా! నా కేమిస్తారు?"

"చెప్పరేం మరి? ఇప్పటి కిప్పుడు ఏమివ్వగలను?" అంటూ దేవుని పటం ముందున్న మల్లెపూల దండ తీసి శుభాకాంక్షలతో నా కందించింది విజయ.

"ఉహూ! మీరే పెట్టండి" అంటూ వెనక్కి తిరిగాను.

"మొహం కడుక్కుంటారా? కాస్త తెరిపిగా ఉంటుంది" అన్న విజయ మాటలు కాదనలేదు నేను.

మొహం కడుక్కుని రాగానే తువాలు, టాయిలెట్ బాక్స్ అందించింది విజయ. పెట్టె మూతతీసిచూసి – "చాలా బావుంది ఎక్కడ కొన్నారు, విజయా?" అన్నాను.

"ఎవరో బహుమతిగా ఇచ్చినది లెండి... గంధంతో చేసిన పెట్టెలో అద్దం అమర్చి ఉన్నది కొనాలని ఎన్నాళ్లబట్టో ప్రయత్నిస్తున్నాను నేను..." విజయ కాఫీ అందిస్తూ అంది.

"నేను ప్రెజెంట్‌చేస్తాలెండి మీకు" వెంటనే అన్నాను.

విచిత్రంగా చూసి ఊరుకుంది విజయ.

పండుగనాడు విజయను భోజనానికి పిలిచి పెరుగు వడలు, మైసూరుపాక్ చేసి వడ్డించాను. పెట్టిన అన్నం అలాగే ఉంచేసి ఆలోచనలో పడి కూర్చుండి పోయింది విజయ.

"ఏం, విజయా? మీ కవి సయించవా?" అన్నాను.

ఉలిక్కిపడి సర్దుకుని కూర్చుంది విజయ. విజయ విశాల నేత్రాలలో లీలగా మెరిసే నీటి పొరను చూసి బాధ అనిపించింది.

"విజయా! మీ రెందుకో మీలో మీరు బాధ పడుతున్నారు. ఆత్మీయులతో పంచుకుంటే కాస్త ఊరట కలుగుతుందంటారు. నాకు మీరు అత్యంతాప్తులుగా కనిపించినా మీకు నేను ఆత్మీయురాలి నవునో కాదో తెలీదనుకోండి" అంటూంటే నా కళ్లలో నీళ్లు తిరిగింది. గొంతు గాద్గదికమయింది.

నా మాటలు అర్థం కానట్టు, నమ్మలేనట్టు చూసింది విజయ.

'అంత నిరాసక్తంగా ఉండే అమ్మాయి మీద నా కెందు కింద శ్రద్ధ? తన స్నేహం కోసం తపిస్తానని చులకనా విజయకు?' అనిపించి మనసు చివుక్కుమంది. మౌనంగా ఉండిపోయాను.

కానీ, విషయమేమిటో తెలుసుకోవాలనే ఉత్కంఠను అణచుకోలేక సుధామణిని కదిపాను ఒక రోజు.

"విజ్జికి వాళ్ల బావను చేసుకోవాలని ఉందండీ! కాని వాళ్ల నాన్నగారికి బొత్తిగా ఇష్టం లేదట. మనసు విప్పి చెప్పుకోవడానికి కనీసం తల్లి కూడా లేదా పిచ్చి పిల్లకు." బెంగగా అంది సుధామణి.

'విజయ కనులలో తొంగిచూసే నీలి నీడలకు కారణ మిదా? ఏమవుతుంది విజయ ప్రేమ?' అనుకుని నిట్టూర్చాను. అంతరాంతరాల్లో భగవంతుణ్ణి ప్రార్థించానేమో విజయ బ్రతుకును నందనవనంగా తీర్చిదిద్దమని.

మర్నాడు కాలేజీకి వెళ్లేసరికి విజయ రాలేదు. జ్వరం రావడం వలన సెలవు పెట్టిందట, మొదటి గంట క్లాస్ ఎలా తీసుకున్నానో, ఏం చెప్పానోగానీ క్లాస్ కాగానే ప్రిన్సిపాల్ పర్మిషన్ తీసుకుని విజయ ఇంటికి వెళ్లాను.

యుడికొలోన్‌లో తడిసిన బట్టను నుదుటిమీద వేస్తూ కూర్చున్న సుధామణి చేతి గాజులు నవరిస్తూ నీరసంగా పడుకుని ఉంది విజయ.

తిరిగి అదే అసూయ. 'సుధామణికి బదులు ఆ సపర్యలు నేను చేయగలిగితే..' సుధామణి ఉనికినే సహించలేకపోయాను.

ఏ క్షణాన అలా అనుకున్నానో గానీ మర్నాడే సుధకు ఇంటి నుండి వాళ్లమ్మ గారికి బాగులేనట్టు టెలిగ్రామ్ వచ్చింది.

"మాధవీ, మీరున్నారన్న ధైర్యంతో విజయను ఈ స్థితిలో వదిలి వెళుతున్నాను.." కళ్ల నీళ్లతో చెప్పి కదిలింది సుధామణి.

ఆ రోజే విజయను మా ఇంటికి తీసుకువచ్చాను. విజయకు జ్వరం వచ్చినందుకు బాధగా ఉన్నా, తద్వారా ఆ పిల్లకు సేవచేసే అవకాశం లభించినందుకు కించిత్ సంతోషంగా ఉందేమో అన్న భావన కలిగినప్పుడు నన్ను నేనే తిట్టుకున్నాను.

విజయకు సేవ చేయడంలో ఒక అనిర్వచనీయమైన తృప్తి కలుగుతూంది నాకు. బ్రహ్మరుద్రాదు లొచ్చినా సగం నిద్రలో లేవని నేను విజయకోసం ఇంచుమించుగా రాత్రంతా మేలుకొని ఉండగలుగుతున్నాను. నాలుగు రోజుల్లో విజయ కాలేజీకి వచ్చింది.

ఈ సంఘటన తరువాత విజయ నాతో కాస్త చనువుగా ఉండసాగింది. ముభావంగా, మౌనంగా ఉండే విజయలో మార్పు చూసి ఆశ్చర్యపడ్డాను. చలాకీగా, సరదాగా ఉండే విజయను చూస్తే నాకుకూడా కొత్త జీవం వచ్చినట్టనిపించింది.

"విజయా! ఊర్లో స్వంత ఇల్లుండబట్టి గానీ లేకుంటే నీ గదిలోనే మకాం పెట్టేదాన్ని" అన్నా నొక రోజు విజయతో.

"ఎందుకులెండి? ఆ అమ్మాయే బావగారితో పూనాకు వేంచేయబోతూంది త్వరలో." నవ్వుతూ అన్నది సుధామణి క్షణకాలం స్తబ్ధురాలినయ్యాను.

విజయ చిన్నగా నవ్వి మొహం తిప్పుకుంది. సిగ్గుల పెళ్లికూతురులా ఉన్న విజయను చూస్తూంటే ముచ్చటగా ఉన్నా, ఏదో మోయలేని బరువు గుండెలో విజయ పెళ్ళి నిశ్చయమయింది.

వెళ్లబోయే ముందు విజయను మా ఇంటికి పిలిచాను. బొట్టుపెట్టి, లోపల అద్దం అమర్చిన చందనం పెట్టె తన చేతిలో పెట్టి – "విజయా, ఎన్నెన్నో చెప్పాలనిఉన్నా మూగవోయిన మనసు నన్ను మాట్లాడనీయడం లేదు... కానీ, ఒక్క మాట, విజయా... నీ కెంతమంది సన్నిహితులూ, స్నేహితులు ఉన్నా ఈ మాధవిని మాత్రం మరిచిపోవుగా?" అన్నాను.

పెట్టె తెరిచిన విజయ అందులోని వాడిన మల్లెపూలను చూసి నాకేసి విచిత్రంగా చూస్తూంటే చెప్పలేని ఒక బాధ నా మనసులో సుళ్లు తిరిగి కన్నీరుగా ప్రవహించింది.

మర్నాడు విజయ వెళ్లిపోయింది. కలకలలాడే మోముతో, ప్రపంచంలో ఉండే ఆనందాన్నంతా నింపుకుని మెరిసే కళ్లతో, వికసిత వదనంతో నిలబడి చేయి ఊపుతున్న విజయ రూపం కన్నీటి తెరలలోంచి మసకగా కనిపిస్తూ మాయమయింది.

విజయ అంటే నా కెందు కింత ఇష్టం? హఠాత్తుగా వారిజ గుర్తుకు వచ్చింది. 'పిచ్చి వారిజా' అనుకుని నిట్టూర్చాను.

**ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక**

తేది : 24-11-1971